# అమేజింగ్.. వెడ్డింగ్



**మా పెండ్లికి బహుమతులొద్దు.. చారిటబుల్ ట్రస్ట్‌కు విరాళం ఇవ్వండి**

- ఆహ్వాన పత్రికలో స్కానర్‌తో పాటు ప్రచురణ
- రిటర్న్ గిఫ్ట్ డబ్బులు ఆ చారిటబుల్ సంస్థకే
- నేడు బేగంపేట మ్యారీ గోల్డ్ హోటల్‌లో వివాహం

మియాపూర్ , డిసెంబరు 21 : ఆ యువజంట కల్యాణం లోక కల్యాణం కోరుకున్నది. పెద్దలు.. వేద మంత్రాల సాక్షిగా ఒక్కటవుతున్న ఆ జంట పెండ్లి వేడుక బంధుమిత్రులకు ఆనందాన్నే కాకుండా.. అభాగ్యులకు ఆసరాగా నిలుస్తున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో పెండ్లంటే విలువైన బహుమతులు.. రిటర్న్ గిఫ్టుల హడావిడీ సర్వ సాధారణం. తమ వివాహ వేడుకలకు ఎంతటి వీవీపీలు వస్తారా? ఏమి బహుమతులిస్తారా? అని ఎదురు చూస్తున్న సందర్భాలు లేకపోలేవు. కానీ ఈ యువజంట పెండ్లి వేడుకలో అలాంటివేవి కాన రావు. ఆ సంప్రదాయానికి చరమ గీతం పాడుతూ.. కొత్త సామాజిక సేవకు శ్రీకారం చుడుతూ.. యావత్ సమాజానికి స్ఫూర్తిగా నిలువబోతున్నారా యువ జంట. ఒక్కటి కాబోతున్న ఆ యువ దంపతుల పెండ్లి వేడుకలు బుద్ధి మాంద్య చిన్నారులకు అండగా నిలువనున్నాయి. వివాహానికి హాజరవుతున్న బంధు మిత్రుల నుంచి ఎటువంటి బహుమతులు స్వీకరించబోమని.. బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న చిన్నారులకు సేవలందిస్తున్న చారిటబుల్ ట్రస్టుకు విరాళంగా ఇవ్వాలని ఆహ్వాన పత్రికలో ప్రచురించారు. సదరు చారిటబుల్ ట్రస్ట్ సంస్థకు చెందిన స్కానర్‌ను సైతం ఆహ్వాన పత్రికలో పొందు పరిచారు. పెండ్లి కూతురు తల్లిదండ్రులు యాయవరం వెంకటరమణ జ్యోతి దంపతులు ఈ నిర్ణయం తీసుకుని తమ సేవా తత్పరతను చాటుకున్నారు. అంతేకాకుండా పెండ్లికి హాజరైన బంధు మిత్రులకు ఎటువంటి రిటర్న్ గిఫ్టులు ఇవ్వటం లేదని, అందుకోసం వెచ్చించే మొత్తాన్ని సైతం ఆ చారిటబుల్ ట్రస్టుకే ఇవ్వనున్నట్లు వారు ప్రకటించారు.

### అమెరికాలో నివాసం.. అక్కడే ఉద్యోగాలు

నగరానికి చెందిన యాయవరం వెంకటరమణ జ్యోతి దంపతులు గడిచిన 20 ఏండ్లుగా అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో నివాసముంటున్నారు. వెంకట రమణ ఐటీ ప్రొఫెషనల్‌గా పని చేస్తుండగా.. జ్యోతి గృహిణిగా ఉన్నారు. అంతర్జాతీయ సేవా సంస్థ హెచ్ఎస్ఎస్‌లో ఆ దంపతులు సేవా కార్యక్రమాలలో చురుకుగా భాగస్వాములవుతున్నారు. వారి పెద్ద కుమార్తె సమీర బీ టెక్ పూర్తి చేసి అమెరికాలోనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నది. అదే రాష్ట్రానికి చెందిన తిరుపతయ్య నాగజ్యోతిల కుమారుడు ఐటీ ఉద్యోగి అయిన ఆదిత్యతో ఈ నెల 22న నగరంలోని బేగంపేట మ్యారీ గోల్డ్ హోటల్‌లో వీరి వివాహ వేడుక జరుగనున్నది. అమెరికాలో పలు సేవా కార్యక్రమాలలో పాల్గొన్న వెంకటరమణ జ్యోతి దంపతులు తమ కుమార్తె వివాహ వేడుకలకు బంధు మిత్రులను ఆహ్వానించే ఆహ్వాన శుభ పత్రికలలో ఎటువంటి బహుమతులను తీసుకురావద్దని, వాటికి బదులుగా తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో కొన్ని సంవత్సరాలుగా అభాగ్యులకు అండగా నిలుస్తూ సేవలందిస్తున్న 'ద అమేజ్ చారిటబుల్ ట్రస్ట్' సంస్థకు విరాళం అందించాలని ప్రచురించారు. ఆ సంస్థకు చెందిన స్కానర్‌ను సైతం ఆహ్వాన పత్రికలో అచ్చువేసి పంపిణీ చేశారు. దీంతో పాటు వివాహానికి హాజరైన బంధు మిత్రులకు ఎటువంటి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వటం లేదని.. వాటి కొనుగోలు పేరిట వెచ్చించే మొత్తాన్ని సైతం సదరు చారిటబుల్ ట్రస్ట్‌కే విరాళంగా ఇస్తున్నట్లు వెంకటరమణ జ్యోతి దంపతులు వెల్లడించారు. తమ కుమార్తెతో పాటు కాబోయే అల్లుడు కుటుంబ సభ్యుల మద్దతును కూడగట్టుకుని ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఈ తరహా సేవా కార్యక్రమాలు కొందరికైనా స్ఫూర్తిగా నిలవాలన్నదే తమ ఆలోచనని రమణజ్యోతి తెలిపారు. తమ కుమారుడు ఆదిత్య వివాహ వేడుకల సందర్భంగా వధువు సమీర తల్లిదండ్రుల సేవా ప్రతిపాదన తమకు ఎంతగానో నచ్చిందని తిరుపతయ్యనాగజ్యోతి దంపతులు పేర్కొన్నారు. కాగా రమణజ్యోతి దంపతుల ఆహ్వానాలు అందుకున్న బంధు మిత్రులు ఇప్పటికే సదరు స్కానర్ ఆధారంగా 'ద అమేజ్ చారిటబుల్ ట్రస్ట్'కు కొంత మేర విరాళాలు పంపినట్లు తెలిపారు. అయితే ఈ తరహా సామాజిక సేవ కలిగిన కల్యాణ వేడుకలు విదేశాలలో ఉండగా.. స్వదేశంలో మాత్రం ఇదే తొలిసారి అనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి.



జేఎన్‌జే విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తాం

- జేఎన్‌జే విస్తృత స్థాయి సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి

రవీంద్రభారతి, డిసెంబర్ 21 : జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి పేర్కొన్నారు. గురువారం రవీంద్రభారతిలో టీమ్ జేఎన్‌జే నిర్వహించిన జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ మాక్ హౌసింగ్ సొసైటీ విస్తృతస్థాయి సమావేశానికి మల్లు రవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సమావేశానికి హాజరుకాలేకపోయిన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు జేఎన్‌జే జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని.. ఆయా సభ్యులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదేనని సమావేశానికి పంపిన సందేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌జే వ్యవస్థాపక సభ్యుడు పీవీ రమణారావు మాట్లాడుతూ ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. జేఎన్‌జే సొసైటీకి ఇండ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు తెలుపుతూ.. సొసైటీకి చెందిన 70 మంది సభ్యుల మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కె.మంజుల, బాలినేని నాగభూషణ రావు, బోడపాటి శ్రీనివాస రావు, టాటా శ్రీనివాస్, చిత్ర, తాహీర రుమాని, హసన్ షరీఫ్, నర్సింగ్ రాజ్, శ్రీచంద్ర, మారేపల్లి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్టీపీ పనులను వేగిరం చేయండి

- జలమండలి ఈడీ సత్యనారాయణ

సిటీబ్యూరో, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ ) : నగరంలో కొత్తగా నిర్మిస్తున్న 31 మురుగునీటి శుద్ధి కేంద్రాలపై జలమండలి ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు సమీక్ష నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన ఈ సమీక్ష సమావేశానికి ఎస్టీపీల నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఎస్టీపీల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఈడీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న దానకిశోర్

## ఉద్యోగుల సహకారంతోనే ప్రాజెక్టులు పూర్తిచేశాం

- దానకిశోర్‌ను సన్మానించిన జలమండలి ఇంజినీర్లు, ఉద్యోగులు

సిటీబ్యూరో, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : జలమండలిలో ఎన్నో సంస్కరణలు, రికార్డు సమయంలో ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ఇంజినీర్లు, ఉద్యోగుల సహకారంతోనే సాధ్యమైందని, సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అరుదైన ఘనతలు సాధించిందని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ అన్నారు. జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జలమండలి ఎండీగా పనిచేసి పురపాలక శాఖకు వెళ్లిన సందర్భంగా దానకిశోర్‌ను ఖైరతాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవన్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా దానకిశోర్‌ను ఇంజినీర్స్ అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, ఇతర డైరెక్టర్లు, ఈఎన్సీ చైర్మన్ రామేశ్వర్ రావు, జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, జనరల్ సెక్రటరీ హరిశంకర్, ఇతర సభ్యులు, ఎంప్లాయీస్ యూనియన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క తదితరులు

## మనం మారుతూ.. సమాజ మార్పునకు కృషిచేయాలి

- 15వ గిరిజన, యువజన ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో మంత్రి సీతక్క

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 21 : ఆదివాసుల్లో ఆంజనేయ శక్తి దాగి ఉన్నదని, వారికి చదువుతో పాటు చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉన్నదని మహిళా, శిశు సంక్షేమ శాఖల రాష్ట్ర మంత్రి డి.సీతక్క అన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లోని కో ఆపరేటివ్ ట్రైనింగ్ సమావేశపు మందిరంలో 15వ గిరిజన, యువజన ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డలు ఇప్పుడిప్పుడే మారుతున్న సమాజం వైపు చూస్తున్నారని గుర్తు చేశారు. వారిలో చదువుతో పాటు బిడియం, సిగ్గు తప్పా.. ఎంత తప్పితే అంత పరిజ్ఞానం ఉంటుందన్నారు. ఆదివాసీ బిడ్డలు వారికి నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని , మనం మారుతూ మన సమాజ మార్పునకు కృషిచేయాలని సూచించారు. దేశంలోని మధ్యప్రదేశ్, మహారాష్ట్ర , జార్ఖండ్, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి దాదాపు 279 మంది ఆదివాసి బిడ్డలు ఈ శిక్షణకు రావడం అభినందనీయమన్నారు. కేంద్ర హోం వ్యవహారాల శాఖ, యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు ఆయా రాష్ట్రాల మారుమూల ఆదివాసి యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ రాష్ట్ర డైరెక్టర్ ఏఆర్ విజయా రావు, సహకార సంఘం ట్రైనింగ్ సంస్థ డైరెక్టర్ ఎం.ఆర్.శ్రీనివాస రావు , మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఆర్.ఘనేషన్, జిల్లా యూత్ ఆఫీసర్ ఖుష్బూగుప్తా, ఐసీఎం డా.శ్రీనివాస్ తదితరులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు . వివిధ చట్టాలతో పాటు పలుసంస్కృతిక కార్యక్రమాలు ఈ నెల 27 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## జూలో రక్షణ.. చిన్నారుల సందడి

చార్మినార్, డిసెంబర్ 21 : రోజు రోజుకు నగరంలో పెరుగుతున్న చలితో జంతుజాలం సైతం వణికి పోతున్నాయి. దీంతో జూలోని జంతుజాలన్ని చలి నుంచి కాపాడేందుకు జూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఎన్‌క్లోజర్‌లలో చల్లని గాలులు చేరకుండా గన్నీ సంచులను కట్టి రక్షణ కల్పిస్తున్నారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి జూపార్క్‌ను సందర్శించి ఉల్లాసంగా గడిపారు.





## చెస్ చాంప్ శ్రీనిజ

హైదరాబాద్ ఆట ప్రతినిధి, డిసెంబర్ 21 : ఏపీఎస్ ఆల్‌ఇండియా ఓపెన్ చెస్ టోర్నీలో రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన శ్రీనిజ బాలికల అండర్-14 విభాగంలో 4 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో గ్రీష్మ(3.5) రెండో స్థానం దక్కించుకుంది. అండర్-16 బాలికల కేటగిరీలో జ్యోతి మూడో స్థానం కైవసం చేసుకోగా, అండర్-12లో రోషిత ఐదో స్థానంలో నిలిచింది. చెస్ విజేతలను ఆసిఫ్‌నగర్ మైనార్టీ పాఠశాలకు చెందిన విజయ్‌కుమార్, వజిదా, పుష్పలత, షేక్ ఫయాజ్ తదితరులు అభినందించారు.